ప్రజలకు గరళం.. కూటమి నేతలకు కాసుల వర్షం



నకిలీ మద్యంపై కోడుమూరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎక్సైజ్ సీఐ మంజులకు వినతి పత్రం ఇస్తున్న ఆదిమూలపు సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- కూటమిది 'ప్రజల వద్దకు పాలన కాదు.. ప్రజల ముంగిటకు నకిలీ మద్యం' పాలసీ
- ప్రభుత్వ కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారీ
- వెంటనే అరికట్టాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్
- కోడుమూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ నిరసన

కోడుమూరు రూరల్: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ కూటమి ప్రభుత్వ కుటీర పరిశ్రమలా మారిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ దుయ్యబట్టారు. పెద్ద ఎత్తున నకిలీ మద్యం తయారు చేసి వైన్ షాపుల్లో విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్న చంద్రబాబు సర్కార్ వైనాన్ని నిరసిస్తూ సోమవారం కోడుమూరులో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మద్యం దుకాణాలకు తలుపులు బార్లా తెరిచేయడంతో పాటు, పర్మిట్ రూములను కేటాయించి మందు బాబులను మద్యం మత్తులో ముంచుతోందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో మంచినీరు దొరకని ప్రాంతం ఉందేమో గాని మద్యం దొరకని ప్రాంతం లేదంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రభుత్వ అండతో రాష్ట్రంలోని పాలకొల్లు, చిత్తూరు, కృష్ణా జిల్లాల్లో కూటమి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో వైఎస్ జగనన్న తన హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం చేపడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో వాటిని పేద ప్రజలకు దూరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని డాక్టర్ సతీష్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ ఏకపక్ష విధానాలపై వైఎస్సార్‌సీపీ ప్రజల తరఫున నిత్యం పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజులకు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవి, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, గోపాల్, ప్రసాద్, ఉపసర్పంచు మాదులు, పార్టీ విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి గౌతమ్, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి డీలర్ క్రిష్టారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి శివరాముడు, జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి నరసింహారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి మగ్బుల్, వివిధ మండలాధ్యక్షులు రమేష్‌నాయుడు, రామాంజనేయులు, సోమశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు, ఎంపీటీసీలు సందప్ప, అనురాధ, నాయకులు సూర్యనారాయణ, ప్రవీణ్ కుమార్, ఆదాం, ఎంకే.వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, బందెనవాజ్, జగదీష్, మునెప్ప, లింగమూర్తి, రామక్రిష్టారెడ్డి, రవికుమార్‌రెడ్డి, షాజిత్ ఆలీ, కోటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవస్వామి, నరేష్, నాగరాజు, వెంకటేశ్వర్లు, హనుమంతు, సిరిగిరి మద్దిలేటి, శ్రీనివాసులు, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



ఎంఈఓ జ్యోతికి నియామక పత్రాలు అందిస్తున్న టీచర్లు

సి.బెళగల్: డీఎస్సీ – 2025లో భాగంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు సోమవారం విధుల్లో చేరారు. మండలంలోని ఖాళీలున్న ఆయా పాఠశాలలకు ఎస్జీటీలుగా నియామకం అయిన వారు ఎంఈఓ కార్యాలయం చేరుకుని తమ నియామక పత్రాలను ఎంఈఓ జ్యోతికి అందజేశారు. కాగా మండలానికి నియామకం అయిన 43 మంది నూతన ఉపాధ్యాయులు అందరూ విధులలో చేరినట్లు ఎంఈఓ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులను అభినందించారు.

పాణ్యంలో..



జాయినింగ్ ఆర్డర్స్ అందిస్తున్న ఎంఈఓ

పాణ్యం: డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. పాణ్యం ఎమ్మార్సీలో ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యంలు కొత్తగా నియమితులైన 25 మందికి జాయినింగ్ ఆర్డర్లు అందజేశారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు–3, ఉర్దూ–3, ఎస్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల–10, ఎస్టీ బాలుర పాఠశాల–7, బీసీ రెసిడెన్షియల్–1, ఏపీ మోడల్ స్కూల్–2 మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. మండలానికి కేటాయించిన వారందరూ విధులకు హాజరైనట్లు పేర్కొన్నారు.

రక్త నమూనాల సేకరణ



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: పాణ్యం, కౌలూరు గ్రామాల్లో ఫైలేరియా(బోధకాలు) వ్యాధి నిరోధానికి రక్త నమూనాల సేకరణ ప్రారంభించినట్లు మద్దూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి ఆయా గ్రామస్తుల రక్త నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపుతున్నామని చెప్పారు. పాణ్యంలో 300, కౌలూరులో 300 మంది నుంచి నమూనాలు సేకరించనున్నామని, ఈ ప్రక్రియను 13 నుంచి 16వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

జీఎస్టీపై అవగాహన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: జీఎస్టీ తగ్గిండం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గడం వల్ల నిత్యావసర సరకుల ధరలు తగ్గి ప్రతి కుటుంబానికి కొంత సొమ్ము ఆదా అవుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనపై అధికారులందరూ అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, జిల్లా పరిషత్ పరిపాలన అధికారి మురళీమోహన్ రెడ్డి, నాగరాజు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



గుంతలు పడిన రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: పెద్దపాడు–ఏ. నాగలాపురం రోడ్డు అధ్వానంగా ఉందని, సీసీరోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకుడు గోపినాథ్ అన్నారు. సోమవారం పెద్దపాడులోని పలు ప్రాంతాల్లో సీపీఎం నేతలు పర్యటించారు. మూలగేరు ఉండి ఒడ్డులో వంక మీదుగా పొలాలకు వెళ్లే దారిని కొందరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు వేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మసీదు నుంచి సచివాలయానికి వెళ్లే దారి గుంతలు పడిందని తెలిపారు. మరమ్మతులు చేయాలని కోరారు. నాయకులు పరశురాముడు, నాగరాజు, ఏసురాజు, చిరంజీవి, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాలనీలో పందులను చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు ఫారుక్ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నేతలు 35వ వార్డులో పర్యటించారు. ఫారుక్ నగర్‌లో రోడ్లన్ని అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో పందులు నివాసం ఉంటున్నాయని తెలిపారు. దోమలు బెడదతో పాటు వర్షం పడిందంటే రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, గీత, సరోజ, పద్మ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా వి.శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వరప్రసాదు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. అయితే ఆయన స్థానంలో చిట్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఆయన కల్లూరుకు కూడా కొన్నాళ్లపాటు ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా పనిచేశారు.

ప్రణాళికాబద్ధత అవసరం



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులతో అధ్యాపకులు

పాణ్యం: సరైన ప్రణాళికల లేమితోనే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగుతున్నాయని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శుభం సింఘాల్ అన్నారు. సోమవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం విద్యార్థులకు అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవం సందర్భంగా "ఇంటర్నేషనల్ డిజాస్టర్ ఎడిషన్" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూకంపాలు, కార్చిచ్చులు, వరదల వంటి విపత్తులు మానవ నిర్లక్ష్యం, ప్రణాళికా లోపాల ఫలితమని తెలిపారు. ఇంజినీరింగ్ రంగం ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా నిర్మాణాలు చేయడం అత్యవసరమన్నారు. తరువాత విద్యార్థులు తయారు చేసిన "సేన్ ఆఫ్ బ్రిడ్జ్" మోడల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ ఆశోక్‌కుమార్, రామిరెడ్డి, శ్రీనివాసులు, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో సోమవారం నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కాటినేని నారాయణ, ధర్మకర్త మండలి సభ్యులుగా రామచంద్రుడు, వరలక్ష్మి, లక్ష్మీదేవి, ఎం.లక్ష్మీదేవి, పి.లక్ష్మీదేవి, పెద్ద మల్లయ్య, లక్ష్మీనారాయణ, రామాంజనేయశర్మ, పుల్లమ్మ ప్రమాణ స్వీకారం చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: ఏపీఐఐసీ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. భూములు ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సమస్యలను పరిష్కరించడంలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, సూర్యనారాయణ, రంగస్వామి, బుగ్గ రాముడు పాల్గొన్నారు.

'మోదీ గోబ్యాక్'ను విజయవంతం చేయండి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: కార్మికుల హక్కులను హరించిన నరేంద్ర మోదీ గో బ్యాక్ అని సీఐటీయూ నాయకులు నరసింహులు, సాయిబాబా, కోటేష్ అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ హమాలి అడ్డా వద్ద హమాలి కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం, కూలీ రేట్ల పెంపు వంటి అంశాలపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా చట్టాలు చేస్తూ, కార్మికుల హక్కులను హరించడం నిరంకుశ పాలన అని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 12 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ–జనసేన నేతలు ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి నరేంద్ర మోదీ భజన చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల 15న "నరేంద్ర మోదీ గో బ్యాక్" నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పరిషత్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని చెప్పారు. కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

డాక్టర్ జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో విజయవాడలో జరిగిన దక్షిణ భారత, రాష్ట్రస్థాయి ఈఎన్‌టీ డాక్టర్ల సదస్సులో ఆయనకు ఈ పతకం అందించారు. చెవిలో చీము కారే రోగులకు అత్యాధునిక పద్ధతుల ద్వారా ఆపరేషన్ చేయడం ఎలా, తద్వారా చీము రాకుండా వినికిడి పెంపొందించడం ఎలా అనే అంశాలపై ఆయన చేసిన ఆవిష్కరణలకు ఈ పురస్కారం లభించింది. జరిగిన ఈఎన్‌టీ వైద్యుల ఎన్నికల్లో డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె–సిమెంట్‌నగర్ ఘాట్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. కందికాయపల్లెకు చెందిన పిన్నాపురం మద్దిలేటి, ఆయన భార్య సుబ్బమ్మ, కుమారుడు ద్విచక్రవాహనంపై పాణ్యం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో చాపిరేవుల గ్రామానికి చెందిన షేక్ ఉసేన్, షేక్ షావలి ద్విచక్రవాహనంపై సిమెంట్‌నగర్ నుంచి వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

కర్నూలు(హాస్పిటల్): హృదయ శ్వాస పునరుద్ధరణ(సీపీఆర్)తో ప్రాణాలను కాపాడవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ చెప్పారు. కేఎంసీ అనెస్థీషియా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో సీపీఆర్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితులలో హృదయ శ్వాస పునరుద్ధరణ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనెస్థీషియా విభాగాధిపతి డాక్టర్ విశాల మాట్లాడుతూ.. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ రామశివనాయక్, వైద్యులు, పీజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు విభాగం, ఆ కాలేజీ ఎన్‌సీసీ, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ విభాగం ఆచార్యులు మహేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. సీపీఆర్ చేసే పద్ధతులు, ఎవరికి చేయాలి అనే అంశాలపై ప్రదర్శించారు. రెడ్‌క్రాస్ జిల్లా కో–ఆర్డినేటర్ రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ ఫ్యాకల్టీ మదన్‌మోహన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి రమేష్

ఓర్వకల్లు: ప్రధాని మోదీ పర్యటనకు వ్యతిరేకంగా ఈ నెల 15న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్టీ పేరుతో ప్రజలపై భారీ భారం మోపిందని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్యాకేజీల హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కడప స్టీల్ ప్లాంట్‌ను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఓర్వకల్లు మండలంలో జయరాజ్ స్టీల్ ప్లాంట్ ప్రారంభం పేరుతో వస్తున్న మోదీ స్థానిక నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించకుండా బీహార్, ఒడిశా రాష్ట్రాల వలస కార్మికులను నియమించడం తగదన్నారు. సీపీఐ నాయకులు సుధాకర్, మహబూబ్ బాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వాల్మీకి విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

- కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రకటన చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019లో కర్నూలులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో చెప్పిన విధంగా వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ హామీని నెరవేర్చాలని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. వాల్మీకి విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. గతంలో మోదీ కర్నూలుకు వచ్చిన సందర్భంలో వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 16వ తేదీన జీఎస్టీపై కర్నూలులో నిర్వహించే సభకు హాజరవుతున్న మోదీ వాల్మీకుల ఎస్టీ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానితో చర్చించి పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందేలా కృషి చేయాలన్నారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే వీఆర్‌పీఎస్ ఏకైక లక్ష్యమని, ఆ మేరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, నాయకులు ఖాసీంనాయుడు, డాక్టర్ రాఘవేంద్ర, నగర అధ్యక్షుడు బోయ వెంకటనాయుడు, జిల్లా నాయకులు శివ, రాముడు, వెంకటేష్, బోయ నాగరాజు, ఆంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణ నాయుడు

వీఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన కృష్ణనాయుడును నియమించినట్లు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. స్థానిక మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద వీఆర్‌పీఎస్ నాయకుల సమక్షంలో కృష్ణనాయుడుకు కండువా వేసి బాధ్యతలు అప్పగించారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అటవీ శాఖ ఉద్యోగులతో సీఎఫ్ కృష్ణమూర్తి

కర్నూలు కల్చరల్: జాతీయస్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని కర్నూలు సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ బీవీఏ కృష్ణమూర్తి సూచించారు. విజయవాడలో జరిగిన అటవీ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన కర్నూలు, కడప డివిజన్ల ఉద్యోగులు.. కడప డివిజన్ డీఎఫ్ఓ రాజశేఖర్ బాబు, ఆదోని ఎఫ్ఆర్‌వో పి.తేజశ్వి, సీనియర్ అసిస్టెంట్ రాణా ప్రతాప్, ఎఫ్‌బీవోలు అబ్దుల్ కలాం, ప్రతాప్, వెంకటరెడ్డి, రేణుక, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న, సుంకయ్య, కిశోర్ కుమార్, మల్లిక, గురుప్రసాద్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, షాహిన్ బాను, బేబీలకు ఆయన ఛాంబర్‌లో ఘనంగా సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు అవసరమైన అత్యాధునిక క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. జాతీయ స్థాయి పోటీలకు పది రోజుల ముందు నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. సర్కిల్ కార్యాలయం ఏఓ అబ్దుల్ సుభాన్, కర్నూలు డివిజన్ కార్యాలయం ఏఓ మహమ్మద్ హెసాన్, ఎఫ్ఎస్ఓలు కిరణ్‌కుమార్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ప్రమాదమే..!



బిలకలగూడూరు సచివాలయం రస్తాలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

గడివేముల: ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తరుచూ ప్రమాదాలు జరగడం, రైతులు ప్రాణాలు కోల్పోవడం చూస్తునే ఉన్నాం. బిలకలగూడూరు గ్రామంలోని సచివాలయం, జగనన్న కాలనీకి వెళ్లె రస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండి ఫ్యూజ్‌లు చేతులకు తగిలే విధంగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నిత్యం ఈ రోడ్డు వెంట రైతులు, ప్రజలతో పాటు పశువులు తిరుగుతుంటాయి. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేఎంసీ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఈఎన్‌టీ విభాగం అసోసియేషన్ ఆఫ్ ఓటోలారింగోలజిస్ట్స్ ఆఫ్ ఇండియా(ఏఓఐ) ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన సౌత్‌జోన్ స్థాయి సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ విభాగం పీజీ తృతీయ సంవత్సరం విద్యార్థిని డాక్టర్ దివ్య నాగేశ్వరి ప్రతిభ చాటారు. క్విజ్ విభాగంలో ఆమె గోల్డ్‌మెడల్ సాధించగా టెంపోరల్ బోన్ డిసెక్షన్‌లో డాక్టర్ షేక్ షాజియా జబీన్ సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు. ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగన్న, ఎస్ఆర్ డాక్టర్ ప్రేసి షరాన్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలతో డాక్టర్ చందన రాజారామ్, మంజులాదేవి

కర్నూలు(హాస్పిటల్): మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ అనెస్థీషియా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందన రాజారామ్ ప్రతిభ కనపరిచారు. ఈ పోటీలో ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్ మెడల్, రెండు సిల్వర్ మెడల్స్, ఒక కాంస్యం సాధించారు. ఆమెకు హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా పతకాలు అందించారు. ఆమెను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు.

స్టాఫ్ నర్సుకు ద్వితీయ స్థానం

ఈ పోటీల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న డి.మంజులాదేవి రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, ఒక కాంస్య మెడల్ సాధించారు. అలాగే 11, 12వ తేదీల్లో షంషేర్‌ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన పోటీలో డాక్టర్ చందన రాజారామ్ నాలుగు బంగారు పతకాలు, మంజులాదేవి ఒక బంగారు పతకం, మూడు సిల్వర్, 3 కాంస్య పతకాలు గెలుచుకున్నారు.